క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మౌలాలి: 33/11 కేవీ మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ గాయత్రినగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి 9:45 గంటల వరకు చంధాభాగ్, పటేల్‌నగర్, ఐజెడ్‌ఎం, షాదుల్లానగర్, ఓల్డ్ మౌలాలి, గ్రీన్ హిల్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ అర్చన తెలిపారు. 33/11 కేవీ ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ చంద్రపురి కాలనీ, శారదానగర్, ఓల్డ్ సఫిల్‌గూడ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు జైన్ మందిర్, శివగౌరీ ఎన్‌క్లేవ్, చంద్రగిరి కాలనీ, సూర్యనగర్ కాలనీ, గంగపుత్ర సంఘం, వినాయక్‌నగర్ బ్లాక్‌-3 నుంచి 6, నవభారత్ స్కూల్, నలంద స్కూల్, డీఏవీ స్కూల్, డీమార్ట్ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ తెలిపారు.

ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో..

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ చంద్రగిరి కాలనీ ఫీడర్, వినాయకనగర్ సబ్‌స్టేషన్ 11 కేవీ శారదానగర్, ఓల్డ్ సఫిల్‌గూడ ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మరమ్మతులు జరుగుతాయని ఏడీఈ యాదగిరి తెలిపారు. చంద్రగిరికాలనీ, సూర్యనగర్, జైన్ మందిర్, శివగౌరి ఎన్‌క్లేవ్, నవభారత్ కాలనీ, నలంద హైస్కూల్, డీఏవీ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైభవంగా రుద్రహోమం



గౌతంనగర్: మాస శివరాత్రి సందర్భంగా ఉత్తంనగర్ శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో గురువారం రుద్రహోమం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలతోపాటు శివుడికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మూగు నాగరాజుశర్మ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మంద సంజీవ్‌రెడ్డి




బోడుప్పల్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గురువారం సెక్రటేరియట్‌లో మంత్రి చామకూర మల్లారెడ్డితో కలిసి బోడుప్పల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి కలిశారు. బోడుప్పల్ పార్టీ పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని సీఎం సూచించినట్లు సంజీవ్‌రెడ్డి వెల్లడించారు.

గంజి శ్రీనుకు నివాళి



కుషాయిగూడ: గుండెపోటుతో మృతిచెందిన బీఆర్‌ఎస్ నేత గంజి శ్రీనివాస్ మృతదేహానికి నగర మాజీ మేయర్ బొంతు రాంమోహన్, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పి అండగా ఉంటామన్నారు. గంజి శ్రీను మృతి పార్టీకి తీరని లోటన్నారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులు రేగళ్ల సతీష్‌రెడ్డి, బత్తుల శ్రీకాంత్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

పేదలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ



గౌతంనగర్: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మేకల రాముయాదవ్, లక్ష్మణ్‌యాదవ్ జన్మదిన వేడుకలు గురువారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. సాయినగర్ చౌరస్తాలో పేదలకు ఆహార ప్యాకెట్లు, మిర్జాల్‌గూడలోని సెయింట్ ఆంథోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మల్కాజిగిరి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివరాల ప్రకారం.. ఈ నెల 17వ తేదీ రాత్రి మల్కాజిగిరిలోని ఎస్‌ఎస్‌వై వైన్స్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(60) మృతి చెంది ఉండటాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించామని, కుటుంబ సభ్యులు ఉంటే.. ఫోన్: 87126 62138.

ఐపీఎల్ జోష్

చివరి మ్యాచ్ కావడంతో మరింత హుషారుగా..

- మ్యాచ్ తిలకించేందుకు పెద్దఎత్తున హాజరైన ఫ్యాన్స్
- మహారాష్ట్ర నుంచి బస్సుల్లో వచ్చిన కోహ్లి అభిమానులు
- 2 రోజుల ముందే ఉప్పల్ ప్రాంతంలో హోటల్స్ ఫుల్







ఉప్పల్: ఉప్పల్‌లో ఐపీఎల్‌కు క్రికెట్ అభిమానులు పోటెత్తారు. హైదరాబాద్‌లో గురువారం చివరి మ్యాచ్ కావడంతో పాటు హైదరాబాద్ సన్‌రైజర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్ కావడంతో మరింత క్రేజ్ పెరిగింది. కోహ్లి ఆట చూసేందుకు పెద్దఎత్తున అభిమానులు తరలివచ్చారు. రెండు రోజుల ముందుగానే మహారాష్ట్ర నుంచి బస్సుల్లో వచ్చి ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో బస చేసినట్లు కొంతమంది అభిమానులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి అభిమానుల హడావుడి ప్రారంభమైంది. గంటల తరబడి క్యూలో వేచిచూసి స్టేడియంలోకి వెళ్లారు. ఉప్పల్‌లో క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో పలువురు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 4 గంటల నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డు మొదలుకొని తార్నాక వరకు రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనదారులకు కష్టాలు తప్పలేదు. పెద్దఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

హామీలను దశలవారీగా అమలు చేస్తున్నాం



శక్తిగణేష్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని శక్తిగణేష్ కాలనీలో రూ.23 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చుతున్నానన్నారు. కార్యక్రమంలో ఈఈ రాజు, డీఈ మహేష్, కాలనీవాసులు నర్రా జైపాల్‌రెడ్డి, రాజేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, వీరయ్య, సందీప్, నారాయణరెడ్డి, నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, పరమేష్, కొండయ్య, శ్రావణ్, సరిత, రమేష్, సులోచన తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరంలో సౌకర్యాలపై ఆరా



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: అంధత్వ రహిత తెలంగాణే సీఎం కేసీఆర్ ధ్యేయమని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. కుషాయిగూడలోని భజన్‌మందిర్ ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. కంటి పరీక్షల కోసం వస్తున్న వారికి కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వసతులు, అందిస్తున్న వైద్యసేవలపై ఆమె ఆరా తీశారు. నేరుగా లబ్ధిదారులతో మాట్లాడి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు కంటి వెలుగు కేంద్రానికి వెళ్లి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు రమాదేవి, శిరీష, అశ్విని, స్థానిక నేతలు చక్రపాణిగౌడ్, వరప్రసాద్, బాబుగౌడ్, వాసు, వెంకటేష్, బ్రహ్మచారి, దినేష్, గణేష్, వెంకటేష్, టిల్లు తదితరులు పాల్గొన్నారు.

సందర్శకులను ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్



సందర్శకులను ఆకట్టుకుంటున్న గోదావరి ఎగ్జిబిషన్

బోడుప్పల్: పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన గోదావరి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు సందర్శకులతో కిటకిటలాడుతోంది. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఈఫిల్ టవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, సోలంబో, డ్రాగన్ ట్రెయిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్, జ్యూవలర్ స్టాల్స్, రెడిమేడ్ స్టాల్స్, టాయిస్ స్టాల్స్, డ్రై ఫ్రూట్స్ స్టాల్స్, షాపింగ్ మేళా, చిల్డ్రన్స్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, ఫుడ్ కోర్ట్స్, కూల్ డ్రింక్స్, జ్యూస్ స్టాల్స్ సందర్శకుల కోసం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు నారాయణ వెల్లడించారు. వేసవి విడిదిగా ఈ ఎగ్జిబిషన్ నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. నగర శివారు ప్రాంతమైన బోడుప్పల్, పీర్జాదిగూడ, ఉప్పల్, ఘట్‌కేసర్ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రెజ్లర్లపై లైంగిక వేధింపులు హేయం



ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నేతలు

కుషాయిగూడ: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న మహిళా రెజ్లర్ల పట్ల బీజేపీ ప్రభుత్వం అనుసరించిన తీరును నిరసిస్తూ గురువారం మేడ్చల్ జిల్లాకు చెందిన ప్రజాసంఘాల ప్రతినిధులు ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఎంపీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి తక్షణమే అరెస్టు చేయాలన్నారు. అంతర్జాతీయ ఒలంపిక్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి దేశ కీర్తి ప్రతిష్టలను పెంచిన రెజ్లర్లపై ఇలాంటి దాడులకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోమటి రవి, ప్రధాన కార్యదర్శి జె. చంద్రశేఖర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా ధర్నాలు చేయడం విడ్డూరం

మల్లాపూర్: నాచారం వార్డు కార్యాలయానికి రూ.56 లక్షలు, నాచారం ఓల్డ్ విలేజ్‌లో భూగర్భ డ్రైనేజీ పనుల కోసం రూ.36 లక్షలు నిధులు మంజూరయ్యాయని, మంజూరైన పనులపై కాంగ్రెస్ నేతలు ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ అన్నారు. సమస్యలు ఉన్నప్పుడు కనిపించని నేతలు కష్టపడి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభమయ్యే దశలో ధర్నాలు చేసి ఏదో గొప్పలకు పోతున్నారన్నారు. నాచారం డివిజన్ అభివృద్ధి కోసం కంకణబద్ధులమై పని చేస్తున్నామని తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ వసంతపురి కాలనీలో రూ.17 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ గురువారం ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ యూజీడీ, తాగునీటి పైపులైన్ల పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వీవీ రజనీకాంత్, బాబు, సత్యనారాయణ, సంపత్‌రావు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీవద్దు



శ్రీనివాస్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబితకిషోర్

అల్వాల్: అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితకిషోర్ అన్నారు. గురువారం శ్రీనివాసనగర్ కాలనీలో రూ.30 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించి నిర్ణీత సమయానికి పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఈఈ రాజు, డీఈ కార్తీక్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, స్థానిక నాయకులు సంతోష్, మోసిన్, సుదేష్, రఘుపతిరెడ్డి, చంద్రప్రకాష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం స్థలాన్ని సందర్శించిన మాజీ మేయర్



చర్లపల్లిలో గౌడసంఘం స్థలాన్ని సందర్శిస్తున్న మాజీ మేయర్ బొంతు రాంమోహన్

కుషాయిగూడ: చర్లపల్లిలో గౌడ సంఘానికి కేటాయించిన స్థలాన్ని గురువారం మాజీ మేయర్ బొంతు రాంమోహన్ సందర్శించారు. బొంతు రాంమోహన్ మేయర్‌గా ఉన్న సమయంలో తాటి, ఈత వనం కోసం 5 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలం నుంచి ఇటీవల డ్రైనేజీ నిర్మాణం చేపడుతుండగా గౌడసంఘం ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానన్నారు. గౌడసంఘం ప్రతినిధులు బొడిగె ప్రభుగౌడ్, ఆనంద్ రాజ్‌గౌడ్, రుద్రగోని రాంచందర్‌గౌడ్, నర్సింహగౌడ్, ప్రభాకర్‌గౌడ్, శ్రీరాములు, బాపుగౌడ్, క్రాంతి, అశోక్‌గౌడ్, నాదం, అంజయ్య, రాములు, రంజిత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్



మచ్చబొల్లారంలో ముగిసిన జోడో యాత్రలో పాల్గొన్న నందికంటి శ్రీధర్

అల్వాల్: హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. కొద్ది రోజులుగా మచ్చబొల్లారం డివిజన్‌లో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర గురువారం ముగిసింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ కేసీఆర్ సర్కార్ ఎన్నికల హామీలను నెరవేర్చాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలన్నారు. ప్రతి దళితుడికి దళిత బంధు అందేవిధంగా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కేవలం ఓట్ల వరకే పరిమితం అయ్యాయన్నారు. మాయమాటలు చెబితే నమ్మే కాలం పోయిందన్నారు. ప్రజల పన్నులతో అందిస్తున్న సంక్షేమ పథకాలకు సైతం లంచాలు ఇవ్వాల్సి వస్తోందన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని కాలనీల్లో సమస్యలే అధికంగా ఉన్నాయన్నారు. కమిషన్లు, కలెక్షన్ల కోసమే అభివృద్ధి జపం చేస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకుల తొత్తులుగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, దోని, రమేష్, నిమ్మ అశోక్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్, సీఎల్ యాదగిరి, అప్సర్, పవన్, సంజీవ్‌కుమార్, సూర్యప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వీనస్‌మేరి, సాయి, పాండు, విజయలక్ష్మీ, నిర్మల, సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ సామల బుచ్చిరెడ్డి

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజా సమస్యలపై గురువారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ సామల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రధాన రహదారి ప్యాచ్‌వర్క్ కోసం తీర్మానం చేసిన పనులను వెంటనే పూర్తి చేయాలని, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వార్డు ఆఫీసర్లు సకాలంలో విధులకు హాజరు కావడం లేదని, వారిని వేరే సెక్షన్లకు మార్చాలని కోరారు. పారిశుద్ధ్య విషయంలో పనితీరు బాగున్నా, కొన్ని కాలనీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కెమికల్ కంపెనీలు, కుటీర పరిశ్రమలు జనావాసాలకు నష్టం కలిగించే విధంగా ఉన్నాయని వాటిపై చర్యలు ఆదేశించారు. అధికారులు, పాలకవర్గం సమన్వయంతో పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పిద్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ ఎ.వాణిరెడ్డి, మేనేజర్ మంజులత, కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మారెడ్డి, రాసాల వెంకటేశ్‌యాదవ్ డీఈఈ శారద, శ్రీలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



డ్రైనేజీని పరిశీలిస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: ద్వారకానగర్‌లో బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి గురువారం పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలో విపరీతమైన దుర్వాసన వస్తుండటంతో ఎయిర్‌టెక్ మెషిన్‌తో డ్రైనేజీని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త చెదారాన్ని రోడ్లపై, డ్రైనేజీల్లో వేయకుండా స్వచ్ఛ ఆటో కార్మికులకు అందించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అందరం నడుం బిగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మోదుగు శేఖర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం

మేడిపల్లి: పీర్జాదిగూడ వివేకానందనగర్‌కు చెందిన పేద వైద్య విద్యార్థి గుమ్మడి విశాల్‌కు పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి గురువారం రూ.లక్ష ఆర్థిక సహాయం చేశారు. పీర్జాదిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుమ్మడి వెంకటయ్య కుమారుడు విశాల్ జోకా కోల్‌కత్తాలోని ఈఎస్‌ఐ మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసిస్తున్నాడు. నిరుపేద కావడంతో కళాశాల ఫీజులు, ఇతర ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. వైద్య విద్య పూర్తయ్యే వరకు అండగా ఉంటామని అన్నారు. కార్పొరేటర్ మద్ది యుగంధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు మాడుగుల చంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, చెరుకు పెంటయ్యగౌడ్, రఘువర్ధన్ రెడ్డి, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



యువజన వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం

కాప్రా: ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో గురువారం ఏఐవైఎఫ్ మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లాఖాద్రీ మాట్లాడుతూ.. యువజన హక్కుల సాధనకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని, సమగ్ర యువజన విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. పాలకుల యువజన వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఉపాధ్యక్షులు నిర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా నూతన కమిటీ

ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా సల్మాన్ బాగ్, కార్యదర్శిగా టి.సత్యప్రసాద్, ఉపాధ్యక్షులుగా రాజ్‌కుమార్, గిరిబాబు, అబ్దుల్ ఘని, సహాయ కార్యదర్శులుగా సద్దాం, సత్యంను ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఎమ్మెల్యే ఇంటి ముట్టడి



నాచారంలో ప్రజాదీక్షలో రాగిడి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి విమర్శించారు. గురువారం నాచారం డివిజన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మేడల మల్లికార్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రజా దీక్ష, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాగిడి లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. నాచారం విలేజ్ వార్డు కార్యాలయం, పునర్‌నిర్మాణంలో జాప్యం, అంగన్‌వాడీ స్కూల్, శ్మాశనవాటిక, పటేల్‌కుంట చెరువు సుందరీకరణ, డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే స్థానిక ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు భద్రయ్య, శేఖర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, కృష్ణారెడ్డి, సంజయ్ జైన్, ఆశ్రూ, హెచ్‌ఆర్ మోహన్, శ్రీనివాస్, గ్యార కిరణ్, టోనీ ఫ్రాన్సిస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా కార్తికేయనగర్ వంతెన పనులు

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని కార్తికేయనగర్ ప్రధాన రహదారిలో రూ.80 లక్షలతో నిర్మిస్తున్న వంతెన(బ్రిడ్జి) పనులు వేగంగా కొనసాగుతున్నాయని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అన్నారు. గురువారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ విశాలమైన బ్రిడ్జిని నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. వర్షాలు ప్రారంభం కాకముందే పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, బీఆర్‌ఎస్ నేతలు బుచ్చన్నగౌడ్, చంద్రశేఖర్, రఫీక్, సుగుణాకర్‌రావు, శ్రీనివాస్, మనోహర్ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానస్పద మృతి



బాలయ్య (ఫైల్)

అల్వాల్: అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వెంకటాపురం దినకర్ నగర్‌లో నివాసముండే బాలయ్య(45) గృహనిర్మాణదారుడు. గురువారం ఉదయం మారుతినగర్‌లో నిర్మిస్తున్న భవనం వద్దకు వెళ్లి అనుమానస్పద స్థితిలో ఉరివేసుకొని మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఉరి వేసుకున్న తీరు గమనిస్తే అనుమానాలకు తావిస్తున్నాయని, పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కుటుంబ సభ్యులు పోలీసులను కోరుతున్నారు.